క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులు సాధించిన బహుమతితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హుజూర్‌నగర్ : కరీంనగర్ జిల్లాలోని ఉట్నూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 7వ ఇంటర్ సొసైటీల పోటీల్లో హుజూర్‌నగర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థి కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నాడు. అతడు లాంగ్‌జంప్‌లో గోల్డ్‌మెడల్, 200మీటర్స్‌లో గోల్డ్‌మెడల్, 600, 400మీటర్ల రన్‌లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. అదే విధంగా పాఠశాలకు మరో ఇద్దరు విద్యార్థులు టి.నరేందర్, ఆర్.చందన హరితేజ కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. దీంతో ఆదివారం ప్రిన్సిపాల్ కె.రాధాకృష్ణమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.నందానాయక్, జీవీపీ రమేష్, పీఈటీలు పి.మధుసూదన్‌రావు, టి.విజయ్, టీచింగ్, నాన్ టీచింగ్ బృందం విద్యార్థులను అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మునగాల: మండలంలోని బరాఖత్‌గూడెంలో భారత మానవ హక్కుల సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఫౌండర్, చైర్మన్ నలబోలు కృష్ణారెడ్డి అధ్యక్షతన సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవ సలహాదారుడిగా పల్లె రామిరెడ్డి, అధ్యక్షుడిగా కూచిపూడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీగా సోమిరెడ్డి లచ్చిరెడ్డి, కోదాడ నియోజకవర్గ కార్యదర్శిగా గుండ్లపల్లి బ్రహ్మారెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు నరాల రుక్మారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్కుల్ల శ్రీనివాస్, సంఘం పెద్దలు ఓరుగంటి రవి, ఎనుగుల వీరబాబు, రాయల కృష్ణ, బేతం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణమూర్తి మృతి బాధాకరం

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన సీనియర్ ఎలక్ట్రీషియన్ రమణమూర్తి మృతి బాధాకరమని మున్సిపల్ వైస్‌చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో రమణమూర్తి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రమణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామచంద్రయ్య, మన్సూర్‌అలీ, సత్యనారాయణ, సైదారావు, సైదులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురువయ్య సేవలు మరువలేనివి

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ నాయకుడు నందిగామ గురువయ్య సేవలు మరువలేనివని ఆపార్టీ గ్రామ నాయకులు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మాదవరాయనిగూడెంలో గురవయ్య మృతదేహంపై కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండాకప్పి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి సంఘీభావం తెలిపి అండగా ఉంటామన్నారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ



బెడ్‌షీట్ల పంపిణీలో పాల్గొన్న సభ్యులు

మఠంపల్లి : మండలంలోని సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో గల వృద్ధులకు స్థానిక జ్యోతిప్రకాశ్ యువజన నాట్య కళామండలి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెయింట్‌ఆన్స్ సుపీరియర్ సిస్టర్ రూబిన్, కళానాట్యమండలి అధ్యక్షుడు ప్రకాష్‌బాబు, కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భద్రంరాజు వెంకటరామారావు, ఆనంద్‌బాబు, జోస్‌బాబు పాల్గొన్నారు.

కర్ల శ్రీనివాస్‌కు పుడమిరత్న పురస్కారం

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కవి, గాయకుడు కర్ల శ్రీనివాస్ పుడమిరత్న విశిష్ట పురస్కారం అందుకున్నాడు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన పుడమి సాహితీ వేదిక 5వ వార్షికోత్సవంలో ఏపీ తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొని పుడమిరత్న విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ స్థానికంగా మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని గుర్తించి అందజేస్తున్న పురస్కారాల్లో భాగంగా తనకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

అధ్వానంగా ఎత్తిపోతల నిర్వహణ

- శిథిలావస్థకు చేరిన మోటార్లు, పైపులైన్‌లు
- సాగునీరందక బీళ్లుగా మారుతున్న వేల ఎకరాలు
- మరమ్మతులు చేపట్టి పంటలకు నీరందించాలని రైతుల వేడుకోలు



నిరుపయోగంగా ఉన్న ఎల్‌-34 ఎత్తిపోతల పథకం



మరమ్మతులకు నోచుకోని ఎల్‌-34 పథకం మోటార్లు

నడిగూడెం : మండలంలోని సాగర్ ఎడమకాల్వపై ఉన్న పలు ఎత్తిపోతల పథకాల నిర్వహణ అధ్వానంగా మారింది. 25ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ పథకాలకు నాటి నుంచి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. గతంలో ఈ పథకాల నిర్వహణ ప్రభుత్వమే నీటి సంఘాల ద్వారా నిర్వహించేది. 15సంవత్సరాలుగా నీటి సంఘాలు రద్దు కావడంతో రైతులే స్వచ్ఛందంగా ఆపరేటర్లకు పన్నులు చెల్లించి నిర్వహించుకుంటున్నారు. పైపులైన్‌లు పూర్తిగా దెబ్బతినడంతో పాటు మేజరు, మైనరు కాల్వలు స్వల్పంగా పూడాయి. పలు చోట్ల కాల్వల్లో కంపచెట్లు దట్టంగా పెరిగాయి. అదే విధంగా మోటార్లు నిత్యం మరమ్మతులకు గురవుతుండడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

అనుబంధంగా నాలుగు ఎత్తిపోతల పథకాలు..

మండలంలోని సాగర్ ఎడమకాల్వకు అనుబంధంగా నాలుగు ఎత్తిపోతల పథకాలున్నాయి. నడిగూడెం వద్ద ఎల్‌-34 పథకం ఉంది. దీని కింద నడిగూడెం- రామాపురం గ్రామాల పరిధిలో 600ఎకరాల ఆయకట్టు ఉంది. నారాయణపురం వద్ద ఉన్న ఎల్‌-35 పరిధిలో నారాయణపురం, బృందావనపురం, వేణుగోపాలపురం, కరివిరాల, చెన్నకేశ్వాపురం గ్రామాల్లో 4800ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఎల్ -36 పరిధిలోని కాగితరామచంద్రాపురం కింద 600ఎకరాలు, ఆర్ -10 పరిధిలోని సిరిపురం గ్రామాలో 4వేల ఎకరాల ఆయకట్టు సాగుకానుంది. ఈ ఎత్తిపోతల పథకాల ఆధునీకరణ కోసం గత ప్రభుత్వం నిధులు కేటాయించి కోట్ల రూపాయలతో మరమ్మతులు చేసింది. నామ మాత్రం పనులతో చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.

నిరుపయోగంగా ఎల్‌-34 పథకం..

గత ఏడాది మండల కేంద్రానికి సమీపాన ఉన్న ఎల్‌-34 ఎత్తిపోతల పథకానికి అత్యవసర పనులు కింద రూ.15లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మోటార్లు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాల్సిఉంది. కాని నిధులు మంజూరై 6నెలలు దాటినా నేటికి పనులు చేపట్టలేదు. దీంతో ఆ పథకం కింద దాదాపు 60ఎకరాలకు పైగా బీళ్లగానే ఉన్నాయి. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తామని హామీనిచ్చి విస్మరించిందని, కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి చివరి భూములకు నీరందించాలని మండల రైతులు కోరుతున్నారు.

అధికారులు మరమ్మతులు చేపట్టాలి



పైపులైన్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మేజర్, మైనర్ కాల్వలు పూడిపోయాయి. సొంత డబ్బులతో రైతులతో అత్యవసర మరమ్మతులు చేయించాము. ఆధునీకరణ పనులు చేసినా ఫలితం లేదు. దీంతో చివరి భూములకు నీరందడంలేదు. అధికారులు స్పందించి ఈ వేసవిలో ఎత్తిపోతల పథకాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలి.

– మండవ అంతయ్య, మాజీ చైర్మన్, బృందావనపురం

రైతులకు సాగు నీరందించాలి



నడిగూడెం సమీపాన ఉన్న ఎల్‌-34 ఎత్తిపోతల పథకం కింద సాగు నీరందకపోవడంతో గత కొద్ది సంవత్సరాలుగా సొంతంగా తన పొలంలో బావి తవ్వించుకుని సాగు చేసుకుంటున్నాను. సంబంధిత అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి, రైతులకు సాగు నీరందించాలి.

– పందిరి శేఖర్‌రెడ్డి, రైతు, నడిగూడెం

కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ : ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో సభ్యుడిగా నమోదై ఉండాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జెట్టి ప్రసాద్ అధ్యక్షతన ఆ సంఘం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు తప్పనిసరిగా సంక్షేమ బోర్డులో చేరాలని సూచించారు. సభ్యుడిగా నమోదైన వారి పిల్లల పెళ్లికి, ప్రసూతి ఖర్చులకు సాయంగా రూ.లక్ష అందించాలని, 60ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి కనీసం రూ.10వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద షెడ్లు నిర్మించి, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పనిప్రదేశాల్లో ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు కనీస నష్టపరిహారం రూ.10లక్షలకు పెంచాలని, సాధారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి జక్కుల రమేష్, యూనియన్ నియోజకవర్గ నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, బి.రమేష్, పి.రాజు, జె.రమణ, ఎం.రమణ, అనిల్, బాలశౌరి, శ్రీనివాస్, ప్రసాద్, సాగర్, బాబు, బాలరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేయాలి



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

కోదాడ : తెలుగు సాహిత్యాన్ని చిన్నతనంలోనే విద్యార్థులకు పరిచయం చేయాలని, దానిలో వారు అభిరుచి పెంచుకొనే విధంగా ఉపాధ్యాయులు, పాఠశాలలు కృషి చేయాలని కొత్తగూడెం క్లబ్ నిర్వాహకుడు డాక్టర్ రమేష్‌బాబు కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 'కొత్తగూడెం చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ' ఆధ్వర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించిన 'కథా, కవితల సమావేశం' ఆదివారం ముగిసింది. ఈ సమావేశంలో కోదాడలోని తేజ విద్యాలయానికి చెందిన 8మంది విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారని, తెలంగాణ వ్యాప్తంగా 350పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల నిర్వాహకురాలు రమాసోమిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పలువురు తెలుగు కవులు విద్యార్థులకు తెలుగు సాహిత్యం గురించి వివరించడంతో పాటు విద్యార్థుల చేత చెప్పించారని అన్నారు. తెలుగు పద సంపదను మెరుగు పరుచుకోవడంతో పాటు వివిధ పత్రికల్లో వచ్చే కవితలు అందులోని అర్థాన్ని విద్యార్థులు అవగాహన చేసుకోనే విధంగా కవులు విద్యార్థులకు మెలుకువలు నేర్పించారని, ఇవి వారికి ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సిరికొండ అనూష వెల్లడించారు.

కిష్టపట్టె గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తా



హుజూర్‌నగర్ : యర్రకుంటతండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



హుజూర్‌నగర్ : రేబల్లెలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కిష్టపట్టె గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం చింతలపాలెం మండలంలో ఆయన పర్యటించారు. మండలంలోని రేబల్లెలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం యర్రకుంటతండాలో నూతనంగా నిర్మించిన గ్రామపచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన హయాంలోనే కిష్టపట్టె గ్రామాలకు వివిధ సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేశానని తెలిపారు. యర్రకుంటతండాలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఇనుపకుతికల నర్సింహామూర్తి, బుజ్జి హుస్సేన్‌నాయక్, లక్యానాయక్, ఎంపీటీసీ బుజ్జి సక్రూనాయక్, తహసీల్దార్ సరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మఠంపల్లి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మఠంపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను, టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మండలంలోని కొత్తతండాలో అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించి ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని, బీఎల్‌ఓ విధుల నుంచి తప్పించాలని, ఆయాలను నియమించి తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు మంత్రి స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, అంగన్‌వాడీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నీలాబాయి, సంతోష్‌కుమారి, లింగమ్మ, కుమారి, రాములమ్మ, గోవిందమ్మ, నారాయణమ్మ, తదితరులున్నారు.

రామాయణం నేటి ప్రపంచానికి ఆదర్శనీయం



హుజూర్‌నగర్ : సభలో పాల్గొన్న స్వామీజీలు, వక్తలు

హుజూర్‌నగర్ : రామాయణం నేటి ప్రపంచానికి ఆదర్శనీయమని గుంటూరు శారద మఠం అధ్యక్షులు ప్రవ్రాజిక భవానీ ప్రాణమాతాజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో 5వ భక్త సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రామాయణం కాలంలోని మహా పతివ్రతలు తార, మండోదరి లాంటి వారు నేటి ఆధునిక నారీమణులకు ఆదర్శమన్నారు. సభలో బోధమయ ప్రాణమాతాజీ, వందే మాతరం ఫౌండేషన్ శ్రీ రవీందర్‌రావు, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందాజీ, కూచిబొట్ల పార్థసారథి, స్వామి శితికంఠానందజీ, స్వామి సన్నివాసానందజీ, స్వామిజీలు, మాతాజీలు, వక్తలు వివిధ అంశాలపై చేసిన ఆధ్యాత్మిక ప్రసంగాలు పలువురిని ఆలోచింపజేశాయి. తొలుత స్థానిక రామకృష్ణ సేవా సమితి నూతన భవనాన్ని రామకృష్ణ మిషన్ విజయవాడ అధ్యక్షుడు స్వామి వినిశ్చలానందజీ, కంప్యూటర్ సెంటర్‌ను స్వామి శితికంఠానందజీ ప్రారంభించారు. విరామ సమయంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి వారి భజనలు, రంగాచార్యులు ఆలపించిన త్యాగరాజ కృతులు, తన్వి డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నత్యాలు పలువురిని అలరించాయి. అనంతరం ఆహుతులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

గరిడేపల్లి : అయోధ్యలో సోమవారం జరగనున్న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం నుంచి రామాలయం వరకు డీజే పాటలతో పెద్దఎత్తున జైశ్రీరామ్ అంటూ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

నేరేడుచర్ల : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, అయోధ్య తీర్థ క్షేత్ర కమిటీ, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతా రాముల ఆశీర్వాదాలను పొందాలన్నారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని నేరుగా చూసే విధంగా ఎల్‌ఈడీ స్క్రీన్స్‌లను ఏర్పా టు చేసినట్లు తెలిపారు. హనుమాన్ చాలిసా పారాయణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు హుజూర్‌నగర్‌లో రామనామ సంకీర్తన



గరిడేపల్లి : శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

హుజూర్‌నగర్ : అయోధ్యలోని శ్రీభవ్య రామమందిరంలో సోమవారం జరిగే బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రతిష్ఠా కార్యక్రమం ముగిసే వరకు పట్టణంలోని రామాలయంలో శ్రీ అన్నమయ్య భజన బృందంచే రామనామ సంకీర్తన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ నేపథ్యంలో తొలుత స్థానిక కనకదుర్గమ్మ ఆలయం నుంచి రామాలయం వరకు భజన బృందం సభ్యులు భక్తులచే నగర సంకీర్తన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ప్రతి డివిజన్‌లో బంజారా భవన్‌ను నిర్మించాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న బంజారా నాయకులు

కోదాడ : తెలంగాణలోని ప్రతి డివిజన్‌లో బంజారా భవన్‌ను నిర్మించాలని, ఎస్టీల రిజర్వేషన్‌లను 10శాతానికి పెంచాలని, ప్రైవేట్ సంస్థల్లో ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం కోదాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు భావసింగ్, రఘునాయక్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అవార్డులు పొందిన గిరిజన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో భూక్యా సైదానాయక్, హనుమానాయక్, నందలాల్, మోతిలాల్, భూక్యా రవినాయక్, రాజు నాయక్, రాగ్యానాయక్, రాంప్రసాద్, సైదానాయక్, పవన్ రాథోడ్, సక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీల ఎన్నిక



నూతన కమిటీలతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న నాయకులు

మునగాల : మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తురుగంటి అంజయ్యమాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా గుడిపాటి కనకయ్యమాదిగ, అధికార ప్రతినిధిగా జిల్లేపల్లి లింగరాజుమాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లంజేపల్లి నాగరాజుమాదిగ, ఉపాధ్యక్షుడిగా గద్దల అశోక్, బచ్చలకూరి వెంకటేశ్వర్లుమాదిగ, కత్తి శ్రీనుమాదిగ, ప్రధాన కార్యదర్శులుగా సూరేపల్లి గోపిమాదిగ, పందిరి వెంకటేశ్, కార్యదర్శులుగా రాంపంగు లింగయ్య, లంజేపల్లి వీరబాబు, మేరుగ వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా గంట అశోక్‌మాదిగ, కోశాధికారిగా నెమ్మాది రామారావు, సహాయ కార్యదర్శులుగా లంజేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా లంజేపల్లి శ్రీను, అధికార ప్రతినిధిగా నెమ్మాది రవితేజ, ఉపాధ్యక్షుడిగా చిర్రా సురేష్‌ను ఎన్నుకున్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాతకొట్ల నాగరాజు మాదిగను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో జిల్లా నాయకులు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, ఎంఎస్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య, ఎంఎస్పీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలానా పాల్గొన్నారు.

జైశ్రీరామ్ ఆకృతిలో విద్యార్థులు



కోదాడ : అయోధ్యలోని బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని కోదాడలోని తేజ టాలెంట్‌స్కూల్ విద్యార్థులు జైశ్రీరామ్ ఆకృతిలో కూర్చొని ఆకట్టుకున్నారు.

మంత్రి సహకారంతో అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

నేరేడుచర్ల : మండల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో తన వంతుగా కృషి చేస్తానని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. ఆదివారం మండలంలోని దిర్శించర్ల గ్రామంలో జెడ్పీ నిధులు రూ.14లక్షలతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి సహకారంతో జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం పాటుపడతానన్నారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాగంటి మాధవిసైదులు, గ్రామస్తులు లచ్చయ్య, సైదులు, వెంకన్న, మహేష్, నాగయ్య, కళ్యాణ్, నాని, పవన్, లక్ష్మీనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులంలో 2024–25 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు ఈనెల 23వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధన విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రూ.100లు రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- వినియోగం లేక శిథిలావస్థకు చేరుతున్న వైనం
- నడిరోడ్డుపై ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



గరిడేపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

గరిడేపల్లి : మండల కేంద్రంలో 20ఏళ్ల క్రితం లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు ఎంతో రద్దీగా ఉండే ఈ బస్టాండ్‌కు ప్రస్తుతం బస్సులు రాకపోకలు సాగించకపోవడంతో ఆవరణ వ్యర్థాలతో నిండి అధ్వానంగా మారి భవనం శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్ కొన్నేళ్ల పాటు ప్రయాణికులతో రోజు కళకళలాడేది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోదాడ, మిర్యాలగూడ, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాలంటే దాదాపు గరిడేపల్లి మండల కేంద్రాన్నే ఎంచుకునేవారు. ఈ కేంద్రం నుంచే లగ్జరీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, సూపర్‌డీలక్స్ బస్సులు సైతం ప్రయాణాలు సాగిస్తుంటాయి. కాని ఆర్టీసీ అధికారులు పట్టించుకోకుండా వదిలేసి నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో ఏఒక్క బస్సు బస్టాండ్‌కు రాకుండా పట్టణంలోని ప్రధాన కూడలి నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో బస్టాండ్‌కు ప్రయాణికులు సైతం రావడం మానేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారి శిథిలావస్థలు చేరి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుంది.

ప్రయాణికుల ఇబ్బందులు..

ప్రస్తుతం బస్సులు బస్టాండ్‌కు రాకుండా మండల కేంద్రం నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే బస్సులను పట్టణంలోని కల్మలచెరువు రోడ్డు దగ్గర, కోదాడ, సూర్యాపేట వైపు వెళ్లే బస్సులను పోలీస్‌స్టేషన్ ఎదుట నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ఆ కూడళ్లలో బస్సుల కోసం నిలిచి ఉంటున్నారు. అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ గంట తరబడి నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ఒక్కసారి బస్సు రోడ్డు మీద ఆగితే ప్రయాణికులు ఎక్కి దిగే వరకు వెనుక వచ్చే వాహనాలతో పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం భారీ వాహనాలు తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య మరీ తీవ్రంగా ఏర్పడుతోంది. బస్టాండ్ ఉన్నా దానిని వినియోగంలోకి తీసుకురాకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను, ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలిని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



బస్టాండ్ నిరుపయోగంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్లపై నిలిచిఉండడంతో రోడ్లపై ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రయాణికులకు నీడ కూడా ఎక్కడా లేదు. రోడ్లు వెడల్పులో భాగంగా ఉన్న చెట్లు కూడా తొలగించారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– ఆకుల గోపిచంద్, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు, రాయినిగూడెం